క్లుప్తంగా

మానసిక దివ్యాంగులకు వైద్యసేవలు



శిబిరంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, ప్రధాన న్యాయమూర్తి జి.కబర్థి మార్గదర్శనంలో కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శనివారం ప్రకాష్ నగర్‌లోని అంబికా శిశు కేంద్రంలో మానసిక దివ్యాంగులకు సంబంధిత డాక్టర్లచే ఉచితంగా మూగ, చెవిటి, కంటి, తదితర పరీక్షలు, వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో శిశు కేంద్రం అధికారి మహాలక్ష్మి, ఈఎన్‌టీ వైద్యులు జి.శివప్రసాద్, సింధూరి, ఆర్థోపెడిక్ డాక్టర్ దీప్తి, కంటి వైద్య నిపుణులు డాక్టర్ లత, డాక్టర్ అమూల్య, డాక్టర్ విజయ్, వైద్య బృందం పాల్గొన్నారు.

సంస్కృతిని పరిరక్షించుకోవాలి



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎస్వీ మోహన్‌రెడ్డి దంపతులు

కర్నూలు కల్చరల్: భారతీయ సంస్కృతి ఉట్టిపడేలా దీపావళి పండుగను నిర్వహించుకోవడం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మాజీ అధ్యక్షురాలు ఎస్వీ విజయ మనోహరి అన్నారు. నగరంలోని బెంగాలీలు జరుపుకునే దీపావళి వేడుకల పూజా కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బెంగాలీలు తమ సంస్కృతిని గొప్పగా పాటిస్తున్నారని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎస్వీ యూత్ పాల్గొన్నారు.

కర్నూలు వాసికి డాక్టరేట్



ఉజ్వల

కర్నూలు కల్చరల్: కర్నూలుకు చెందిన జి.ఉజ్వలకు డాక్టరేట్ దక్కింది. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో డాక్టర్ కె.అనిత మార్గదర్శకత్వంలో 'ఫ్యాబ్రికేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ పాలిమర్ మాట్రిసెస్ లోడెడ్ విత్ మెటల్ నానోపార్టికల్స్ ఫర్ డ్రగ్ డెలివరీ అప్లికేషన్స్' అనే అంశం చేసిన పరిశోధనకుగాను ఆమె డాక్టరేట్ పొందారు. ఈ పరిశోధన ఫార్మా రంగంలో ద్రవ రూప ఔషధాల సరఫరాకు సహకారమిచ్చే అవకాశముంది.

అందరి సహకారంతో ఆర్‌యూ అభివృద్ధి



మాట్లాడుతున్న డాక్టర్ బి.విజయ్‌కుమార్‌నాయుడు

కర్నూలు కల్చరల్: అందరి సహకారంతో రాయలసీమ విశ్వవిద్యాలయ అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్‌కుమార్ నాయుడు పేర్కొన్నారు. వర్సిటీలోని వీసీ కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్సిటీ పాలనను గాడిలో పెట్టేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. వసతి గృహాల్లో నీటి సమస్యను పరిష్కరించేందుకు వీసీ ఆదేశాలతో బోర్లను బాగు చేయించినట్లు చెప్పారు. రానున్న వేసవిలో నీటి కొరత తలెత్తకుండా జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులతో పాటు, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తున్నామన్నారు. వర్సిటీ పరిధిలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు సరైన సమయంలో పరీక్షల నిర్వహణకు, ఫలితాల ప్రకటన, సర్టిఫికెట్ల జారీకి సంబంధిత విభాగాలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ర్యాగింగ్‌ను పూర్తిగా నియంత్రించేందుకు కమిటీలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

దేశ పురోగతికి పాటుపడాలి



మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న యూనియన్ బ్యాంకు సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): దేశ పురోగతి కోసం ప్రతి పౌరుడు శ్రమించాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయాధికారి నరసింహారావు పిలుపునిచ్చారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా శనివారం యూనియన్ బ్యాంకు సిబ్బంది నగరంలో వాకథాన్ నిర్వహించారు. కలెక్టరేట్ వద్దకు చేరుకుని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ నీతి, నిజాయితీతో పనిచేస్తేనే దేశం అభివృద్ధి చెందుతున్నారు. అధికారులు అనంత్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

వ్యాపారులకు ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి

- నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ



శానిటరీ ఇన్‌స్పెక్టర్లతో సమీక్షిస్తున్న అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థలో వందల సంఖ్యలో అనధికార ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోకుండా కొంత మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వసూళ్లు చేసుకుంటున్నారని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ అన్నారు. త్వరలో అన్ని డివిజన్లలో సచివాలయాల ఉద్యోగులతో పూర్తిస్థాయిలో సమీక్ష, సర్వే చేయిస్తామని స్పష్టం చేశారు. శనివారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో ఆరోగ్య శాఖతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో వాణిజ్య సంస్థలు, వ్యాపారులు తప్పనిసరిగా నగరపాలక సంస్థ నుంచి ట్రేడ్ లైసెన్సు తీసుకోవాలన్నారు. ట్రేడ్ లైసెన్సును పునరుద్ధరించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికీ నగరపాలక పరిధిలో వందల సంఖ్యలో అనధికారికంగా వ్యాపారాలు చేసుకుంటూ నగరపాలక సంస్థకు ట్రేడ్ లైసెన్సు చెల్లించడం లేదన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ల జేబుల్లోకి వెళ్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికైన పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. పెద్ద సంఖ్యలో ట్రేడ్ లైసెన్సుల బకాయిలు ఉన్నాయని, వంద శాతం వసూలు చేయాల్సిన బాధ్యత శానిటరీ ఇన్‌స్పెక్టర్లదే అని చెప్పారు. నగరపాలక ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సూపరింటెండెంట్లు స్వర్ణలత పాల్గొన్నారు.

కేఎంసీ ప్రైడ్ కాంప్లెక్స్ తనిఖీ

నగరంలోని వెంకటరమణ కాలనీలో గతేడాది నూతనంగా నిర్మించిన నగరపాలక సంస్థకు చెందిన కేఎంసీ ప్రైడ్ వాణిజ్య సముదాయాన్ని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ శనివారం తనిఖీ చేశారు. కాంప్లెక్స్‌లో మరమ్మతు పనులు పరిశీలించారు. త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థకు చెందిన ఈ కాంప్లెక్స్‌లో ఇప్పటివరకు 20 షాపులు బహిరంగ వేలం ద్వారా పాటదారులకు కేటాయించామన్నారు. మరో 30 మంది షాపుదారులు పాటపాడి షాపులు దక్కించుకున్నారన్నారు. చిన్న చిన్న పనులు పూర్తి చేసి షాపులు దక్కించుకున్న వారికి అన్ని విధాలా సౌకర్యవంతంగా ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే షాపులను వేలం ద్వారా వ్యాపారులకు కేటాయించి నగరపాలక రెవెన్యూ పెంచే దిశగా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. రెవెన్యూ ఆఫీసర్ జునీద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తిప్పన్న పాల్గొన్నారు.

చర్యలకు రంగం సిద్ధం?

- గతంలో పనిచేసిన కమిషనర్లపై అవినీతి ఆరోపణలు
- ముగిసిన విచారణ
- ప్రభుత్వానికి విజిలెన్స్, రీజినల్ డైరెక్టర్ల నివేదిక

కర్నూలు (టౌన్): గతంలో జిల్లాలోని పలు మున్సిపాల్టీలలో పనిచేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న పలువురికి సంబంధించిన విచారణ ముగిసింది. ఇక ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే విజిలెన్స్ అధికారుల నివేదికతో పాటు ప్రభుత్వం నియమించిన మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ నివేదిక అధారంగా ఈ చర్యలు ఉంటాయని సమాచారం. జిల్లాలోని ఆదోని మున్సి పాల్టీలో పనిచేసిన ఏ.గోవిందప్ప, ఎమ్మిగనూరు మున్సిపాల్టీలో పనిచేసి పదవీ విరమణ పొందిన పి.జె.సంపత్‌కుమార్, కర్నూలు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా పనిచేసిన పి.వి.రామలింగేశ్వర్ (ఆదోని మున్సిపాల్టీ) ఆదోని డిప్యూటీ ఎగ్జి క్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేసిన ఎం.భాస్కర్ రెడ్డి, ఏఈఈ జి.వెంకటరమణ, ఏఈ సి.రమమూర్తి, గతంలో ఎమ్మిగనూరు మున్సిపాల్టీకి చెందిన ఎస్.ఆదినారయణ రెడ్డి, ఆదోని టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్ ఎ.శేఖన్న, కమ్యూనిటీ ఆర్గనైజర్లు ఉన్నారు. వీరంతా గతంలో పనిచేసిన చోట మరుగుదొడ్ల మంజూరులో ప్రభుత్వ నిబంధనలు పాటించలేదని గుర్తించారు. అలాగే ఎం.బుక్‌లో నమోదు చేయలేదన్న అభియోగాలు ఉన్నాయి. ఇప్పటికే విజిలెన్స్, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ల నివేదిక ఆధారంగా ప్రభుత్వం వీరిపై శాఖా పరమైన చర్యలు తీసుకునేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

నగరంలో మంత్రి పర్యటన

కర్నూలు (టౌన్): నగరంలోని 1వ డివిజన్‌లో శనివారం రాత్రి రాష్ట్ర మంత్రి టీజీ భరత్ పర్యటించారు. ఖండేరి వీధిలో స్థానికులతో మాట్లాడారు. సమస్యల గురించి ఆరా తీశారు. మంచినీటి సమస్యతో పాటు వీధిలైట్లు, డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యల గురించి కాలనీవాసులు మంత్రి దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ మాట్లాడుతూ.. కర్నూలు నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. కమిషనర్ రవీంద్రబాబు, ఎస్ఈ రాజశేఖర్, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తానని డీఈఓ శామ్యూల్‌పాల్ హామీ ఇచ్చారు. శనివారం ఏపీఎన్‌జీఓ చైర్మన్ వీసీ వెంగళ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు ఉద్యోగులు డీఈఓను మర్యాదపూర్వకంగా కలిశారు. ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని డీఈఓ సూచించారు. నాయకులు దస్తగిరిరెడ్డి, ఎం,కాశన్న, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షాపరులకు అన్నదానం



భోజనం వడ్డిస్తున్న మేయర్ బీవై రామయ్య

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని కర్నూలు నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య అన్నారు. సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో మాలధారణ భక్తులకు శనివారం అన్నప్రసాద వితరణను కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. దాతలు, భక్తుల సహకారంతో సుమారు 75 రోజుల పాటు అన్నదానం చేయడం మంచి కార్యమన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రోజు సుమారు 800 మంది మాలధారులు భిక్ష స్వీకరిస్తారన్నారు. కార్యక్రమం నిర్విరామంగా కొనసాగేందుకు దాతలు, భక్తులు సహకారం అందించాలని కోరారు. కార్పొరేటర్ కైపా పద్మలతా రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలి

కర్నూలు (అర్బన్): బీసీ కుల కార్పొరేషన్లకు నిధులు మంజూరు చేసి, పాలకవర్గాలను నియమించి బలోపేతం చేయాలని బీసీ జేఏసీ కన్వీనర్లు దేవపూజ ధనుంజయ ఆచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య ఆధ్వర్యంలో మంత్రి టీజీ భరత్‌ను శనివారం కలసి వినతిపత్రం అందజేశారు. కర్నూలులో నిలిచిపోయిన బీసీ భవనాన్ని వెంటనే పూర్తి చేయాలని, జొహరాపురం పరిధిలో బీసీ కుల భవనాలను పూర్తి చేసి అధికారికంగా బీసీ కుల సంఘాలకు ఇవ్వాలని కోరారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసి వలసలను నివారించాలని, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అయ్యన్న యాదవ్, ధన విజేయుడు, సుగూరు వెంకటేశ్వర్లు, భాస్కరప్ప, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉపకార వేతనాల పంపిణీ

కర్నూలు కల్చరల్: గుంటూరు 'కృష్ణ దేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలేజ్డ్', కర్నూలు రోపా సంయుక్త ఆధ్వర్యంలో చదువులో ప్రతిభ కనబరిచిన 160 మంది పేద విద్యార్థులకు రూ.7.50 లక్షల ఉపకార వేతనాలు పంపిణీ చేయనున్నట్లు తులసి గ్రూప్ ప్రతినిధులు తెలిపారు. ఇందులో రూ.3.75 లక్షలు తులసి సీడ్స్ వారు కృష్ణ దేవరాయ సంస్థ ద్వారా ఉపకార వేతనాలు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక రావూరి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జరుగుతుందని తెలిపారు. తులసి గ్రూప్ చైర్మన్ తులసి రామచంద్ర ప్రభు ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు వెల్లడించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం: మండలంలోని మాధవరం గ్రామ శివారులో ద్విచక్ర వాహనంపై మద్యం తరలిస్తున్న వ్యక్తిని మాధవరం పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కోసిగి మండలం డి.బెళగల్ గ్రామానికి చెందిన తిరుమలేష్, చెన్నకేశవరెడ్డి కర్ణాటక రాష్ట్రానికి చెందిన 384 మద్యం ప్యాకెట్లను ద్విచక్ర వాహనంపై తరలిస్తుండగా వాహన తనిఖీల్లో గుర్తించి బైక్, మద్యంను సీజ్ చేసి కేసు నమోదు చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు వివరించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ నాయకులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లును ఏపీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.వెంగల్‌రెడ్డి కోరారు. ఇటీవల సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ వెంకటేశ్వర్లును ఎన్‌జీవోస్ అసోసియేషన్ నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఆసుపత్రిలోని ఉద్యోగులు పలు రకాల సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని డాక్టర్ వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. అసోసియేషన్ రాష్ట్ర సహాధ్యక్షుడు దస్తగిరిరెడ్డి, నగర అధ్యక్షుడు ఎంసీ కాశన్న, కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక

కర్నూలు కల్చరల్: కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి కర్నూలు నగరానికి చెందిన ఆర్జా రామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కర్నూలు నగర బలిజ సంఘం నాయకులు శనివారం నగరంలోని స్వగృహంలో ఆయన్ను ఘనంగా సన్మానించారు. నగర సంఘం కార్యవర్గ సభ్యులు పత్తి ఓబులయ్య, శైలేష్, అమర్, శేషు, సంగా ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

10న స్విమ్మింగ్ పోటీలు

కర్నూలు (టౌన్): రాజమండ్రిలోని మున్సిపల్ స్విమ్మింగ్ పూల్‌లో ఈనెల 10వ తేదీన 7వ రాష్ట్ర స్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.లక్ష్మీనారాయణ రెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్విమ్మింగ్ పూల్ వద్ద పోస్టర్ల ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోటీల్లో పాల్గొనే మాస్టర్స్ స్విమ్మర్స్ ఈ నెల 5వ తేదీలోపు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చాటిన క్రీడాకారులు వచ్చే డిసెంబర్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. బుచ్చన్న, సుధాకర్ పాల్గొన్నారు.

సాధనతోనే విజయం

కర్నూలు (టౌన్): నిత్య సాధన, కృషి, దీక్ష ఉంటేనే క్రీడల్లో పతకాలు సాధ్యమని సెట్కూర్ విశ్రాంత సీఈఓ రమణ అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రోలర్ స్కేటింగ్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్కేటింగ్ క్రీడ చక్కటి వ్యాయామంగా ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను స్కేటింగ్ వైపు ప్రోత్సహించాలన్నారు. పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. అలాగే ఈనెల 6 నుంచి కాకినాడ పట్టణంలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి స్కేటింగ్ పార్కులో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించాలన్నారు. డాక్టర్ రాజేష్, స్కేటింగ్ సీఈఓ సునీల్ కుమార్, అబూబకార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కార్తీక వనభోజనాలు

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు నగర శివారులోని విజయ వనంలో సామూహిక కార్తీక వన భోజనాలు, శ్రీ గోవర్ధన గిరి పూజ నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ కర్నూలు బాధ్యులు రఘునందన సేవక ప్రభు తెలిపారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు అందరూ పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

నేడు హిందూ కార్తీక వనభోజనాలు

సురభి గోశాల, భారతీయ స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ఓర్వకల్ మండలం కాల్వబుగ్గ సమీపంలోని సురభి గోశాలలో హిందూ కార్తీక వన భోజనాలు నిర్వహిస్తున్నట్లు సురభి గోశాల ట్రస్ట్ అధ్యక్షుడు ఏ.ఎస్.మారుతీ కృష్ణన్ శర్మ, ప్రధాన కార్యదర్శి వంగాల నాగేశ్వర్ రెడ్డి తెలిపారు. వికాస భారతి సంఘటనా కార్యదర్శి బీవీ నాగేంద్ర ప్రసాద్ వక్తగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. భారతీయ మానవ హక్కుల సంఘం అధ్యక్షురాలు ఎస్. విజయభారతి, భాగ్యనగరం జాతీయ సాహిత్య పరిషత్ ప్రాంత కార్యదర్శి మావుడూరి సూర్యనారాయణ మూర్తి హాజరు కానున్నట్లు వెల్లడించారు.

రైతుల ఆత్మహత్యలు పట్టని ప్రభుత్వం

- హామీ ప్రకారం రూ.20 వేలు పెట్టుబడి సాయం ఇవ్వాలని కోరుతూ 4న నిరసనలకు పిలుపు



మాట్లాడుతున్న పి.రామచంద్రయ్య

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా పట్టించుకోవడం లేదని, వ్యవసాయం సంక్షోభంలో పడిందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సీఆర్ భవన్‌లో ఏపీ రైతు సంఘం జిల్లా స్థాయి విస్తృత సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయం గిట్టుబాటు గాక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, కొందరు ఇతరరంగాల వైపు మళ్లుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంఎస్ స్వామినాథన్ కమిటీ సిఫారసులను అమ లు చేయాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్ద తు ధర రావడం లేదన్నారు. గిట్టుబాటు ధర కల్పించేలా చట్టం చేయాలని కోరితే పట్టించుకోవడంలేదని వాపోయారు. జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులైన గుండ్రేవుల, వేదవతిని పూర్తిచేయాలన్నారు. దేవనకొండ మండలంలో యురేనియం తవ్వకాలు చేపడితే పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని స్పష్టం చేశా రు. అన్నదాత సుఖీభవ కింద రైతులకు రూ.20 వేలు పెట్టుబడి సాయం తక్షణమే ఇవ్వాలని కోరు తూ సోమవారం అన్ని గ్రామ సచివాలయాల ఎదు ట నిరసన కార్యక్రమాలకు పిలుపునిచ్చినట్లు చెప్పా రు. నాయకులు కె.జగన్నాథం, తిమ్మయ్య, జయలక్ష్మారెడ్డి, నాగేంద్రయ్య, పంపన్నగౌడ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతో చర్మవ్యాధులు దూరం

కర్నూలు(సెంట్రల్): పరిశుభ్రత పాటించకపోతే చర్మవ్యాధులు ప్రబలుతాయని ప్రముఖ చర్మవ్యాధి నిపుణుడు డాక్టర్ శరత్‌చంద్ర పేర్కొన్నారు. శనివారం ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాటు చేశారు. చర్మవ్యాధుల నిర్మూలనపై ఆయన అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.నాగస్వామి నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

అనవసరంగా సిజేరియన్ చేస్తే చర్యలు తీసుకోవాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏపీ మహిళా సమాఖ్య సభ్యులు

కర్నూలు(సెంట్రల్): అవసరం లేకున్నా డబ్బుల కోసం సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్న ఆసుపత్రులపై చర్యలు తీసుకోవాలని ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.గిడ్డమ్మ, పి.శ్రావణి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఏపీ మహిళా సమాఖ్య, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్నూలులో వీధికో ప్రైవేట్ ఆసుపత్రి ఉండడంతో చికిత్స కోసం వెళ్లిన వారికి అవసరంలేని పరీక్షలన్నీ చేసి దోచుకుంటున్నారని విమర్శించారు. గర్భిణులు కాన్పు కోసం వెళితే సిజేరియన్ తప్పా సాధారణ కాన్పులు చేయడం లేదని ఆరోపించారు. సిజేరియన్ అవసరం లేకున్నా కేవలం డబ్బు కోసమే ఆసుపత్రుల యాజమాన్యాలు ఇలా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు జిల్లాలో విచ్చలవిడిగా గర్భస్థ పిండ లింగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారులు కళ్లు మూసుకొని మామూళ్లకు అలవాటు పడ్డారని విమర్శించారు. నాయకులు ఆశాబేగం, శైలజ, సుశీలమ్మ, సులోచనమ్మ, వెంకటేశ్వరమ్మ, పావని పాల్గొన్నారు.

9న రాష్ట్రస్థాయి పెంటాథ్లాన్ పోటీలు

కర్నూలు (టౌన్): శ్రీకాకుళం జిల్లాప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 9, 10 తేదీల్లో అండర్-17 విభాగంలో రాష్ట్రస్థాయి మోడ్రన్ పెంటాథ్లాన్ బాలబాలికల పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎస్.గిడ్డయ్య శనివారం తెలిపారు.

ముగ్గురిపై కేసు నమోదు

కర్నూలు న్యూసిటీ: నగరంలోని 4వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురిపై కేసు నమోదైంది. కల్లూరు శేషన్న నగర్‌కు చెందిన బాధితురాలు విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు నగరానికి చెందిన రామలక్ష్మి, రామాంజనేయులు, బాలసుందరంపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. అప్పు విషయంలో నిందితులు ఎస్సీ, ఎస్టీ కేసు పెడతామని బెదిరించి, దూషించినట్లు బాధితురాలు పిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

5న సీపీఐ జిల్లా సమితి సమావేశం

కర్నూలు(సెంట్రల్): సీపీఐ జిల్లా సమితి సమావేశాన్ని నవంబర్ 5వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, కార్యవర్గ సభ్యులు పి.రామచంద్రయ్య హాజరవుతారని వెల్లడించారు. ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



ఆకట్టుకున్న విద్యార్థినుల నృత్య ప్రదర్శన

కర్నూలు(సెంట్రల్): విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని తెలంగాణకు చెందిన ర్యాంప్ వరల్డ్ బ్యాంకు ప్రాజెక్టు డిపార్టుమెంట్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ సీనియర్ కన్సల్టెంట్ గీతా శ్రీ సూచించారు. శనివారం రవీంద్ర మహిళా డిగ్రీ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా విద్యా సంస్థల వ్యవసాపకుడు జి.పుల్లయ్యతో కలసి జ్యోతి ప్రజ్వలనచేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. జీవితంలో విద్యార్థి దశ ఎంతో కీలకమని, ఉన్నత ఆశయంతో లక్ష్యాల సాధనకు కృషిచేయాలన్నారు. అనంతరం విద్యార్థినుల నృత్యాలు అలరించాయి. కళాశాల డీన్ అండ్ అకాడమిక్ అడ్వైజర్ డాక్టర్ మమతా మోహన్, ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో జీవితాలు నాశనం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ బాబు ప్రసాదు

కర్నూలు(సెంట్రల్): విద్యార్థి దశలో ర్యాగింగ్‌కు పాల్పడి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కర్నూలు డీఎస్పీ జె.బాబుప్రసాద్ సూచించారు. శనివారం ఏ క్యాంపులోని మైపర్ ఫార్మసీ కళాశాలలో ర్యాగింగ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎస్పీ హాజరై ర్యాగింగ్ చట్టాలను వివరించారు. ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్ ఉండదని, విద్యార్థులు ఫ్రెండ్లీ నేచర్‌తో కలిసిమెలసి ఉండాలని కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు సతీష్ సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కాకర్ల సురేష్, అకాడమిక్ డీన్ డాక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మార్కింగ్ పనుల పరిశీలన



ఏపీఎస్‌పీ క్యాంపు వద్ద పనులను పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): స్థానిక ఏపీఎస్‌పీ క్యాంపు వద్ద రహదారి నిర్మాణానికి సంబంధించి మార్కింగ్ పనులను శనివారం నగరపాలక కమిషనర్ సొంగ రవీంద్రబాబు పరిశీలించారు. బళ్లారి చౌరస్తా వద్ద ట్రాఫిక్ నియంత్రణ పనులు చేపట్టేందుకు ఏపీఎస్‌పీ క్యాంపు అదనపు కమాండెంట్ మహబూబ్‌బాషా, టౌన్ ప్లానింగ్ సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్‌తో కమిషనర్ చర్చించారు. కమిషనర్ మాట్లాడుతూ.. బళ్లారి చౌరస్తా సమీపంలోని ఏపీఎస్‌పీ క్యాంపు మీదుగా కొత్త రహదారి నిర్మాణానికి సంబంధించి మార్కింగ్ పనులు చేపడుతున్నామన్నారు. హైదరాబాదు నుంచి వచ్చే వాహనాలను చౌరస్తా సమీపంలోని ఏపీఎస్‌పీ క్యాంపు మీదుగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోకి మళ్లించేలా రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అలాగే టీచర్స్ కాలనీలో కమ్యూనిటీ హాలు, వెంకటేశ్వర వెంచర్ సమీపంలో రహదారి నిర్మాణానికి సంబంధించిన పనులను పరిశీలించారు.